క్లుప్తంగా

భోగాపురంలో శ్రీరామ విజయయాత్ర



భోగాపురంలో శ్రీరామ విజయయాత్ర చేస్తున్న భక్తులు

భోగాపురం: అయోధ్యలోని రామ మందిరంలో ఈనెల 22న బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో శుక్రవారం స్థానిక రామ మందిరం నుంచి అర్చకులు అరవెలపల్లి గురునాథస్వామి, రాధాకృష్ణ ఆధ్వర్యంలో భక్తులు శ్రీరామ విజయయాత్ర నిర్వహించారు. భక్తులు శ్రీరామనామ సంకీర్తన చేసుకుంటూ గ్రామంలోని అన్ని వీధులలో యాత్ర కొనసాగిస్తూ, శ్రీరామ లీలలు ప్రజలకు వివరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

భోగాపురం: మండలంలోని చేపలకంచేరు, ముక్కాం, ముంజేరు పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ గోవిందరావు శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది కలుగకుండా విద్యుత్, వాటర్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. అదేవిధంగా మండలంలోని సమస్యాత్మకమైన ప్రాంతాలను గుర్తించి, వచ్చే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని సీఐకి సూచించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులతో మాట్లాడి ఎన్నికల సమయంలో ఉత్పన్నమయ్యే సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై సూర్యకుమారి, ఏఎస్సై టీఎస్ఎన్ రాజు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన సర్వే ప్రారంభం



గొల్లలపేటలో కులగణనపై వలంటీర్లకు సూచనలిస్తున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే విజయనగరం మండల పరిధిలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం ప్రారంభమైంది. గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కులగణనపై ప్రజల నుంచి వివరాలు సేకరిస్తూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు మండలంలోని గొల్లలపేట, సారిక, పినవేమలి, రాకోడు గ్రామాలను సందర్శించి కులగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి చేయూతనివ్వాలి



బాధితులకు రిలీఫ్ కిట్లను అందజేస్తున్న అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న వారికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి జి.అప్పలనాయుడు అన్నారు. స్థానిక అయ్యన్నపేట కాలనీకి చెందిన అగ్నిప్రమాద బాధితులకు శుక్రవారం రిలీఫ్ కిట్లు అందజేశారు. టార్పాలిన్, బ్లాంకెట్స్, సబ్బులు, ఆయిల్‌బాటిల్, టూత్‌బ్రస్సులు, పేస్ట్, నాప్‌కిన్స్‌తో కూడిన కిట్లను ఏడు కుటుంబాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు వి.సత్యరామ్, చిన్న సురేష్, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ తీర్థ మహోత్సవం



చీపురువలస గ్రామంలో ఊరేగిస్తున్న చెక్క గుర్రాలు

కొత్తవలస: మండలంలోని చీపురువలస గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్క గుర్రాలను ప్రత్యేకంగా అలంకరించి భక్తి శ్రద్ధలతో గ్రామంలో ఊరేగించారు. అమ్మవారి గుడిని ప్రత్యేక పుష్పాలతో అత్యంత సుందరంగా అలకంరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మచ్చ రామస్వామి, కొత్తవలస మేజర్ పంచాయతీ సభ్యుడు లెంక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించే వ్యక్తి అంబేడ్కర్

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి
- సామాజిక సమతా సంకల్ప మహోత్సవానికి సంఘీభావం
- అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రముఖులు



విజయనగరం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు



పూసపాటిరేగ: సీహెచ్ అగ్రహారంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సత్యనారాయణరాజు, తదితరులు



డెంకాడ: మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



డెంకాడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం, తదితరులు



నెల్లిమర్ల: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన చైర్‌పర్సన్ సరోజిని



పూసపాటిరేగ: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ప్రజాప్రతినిధులు



విజయనగరం రూరల్: జెడ్పీ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, డీపీఓ శ్రీధర్‌రాజా, తదితరులు



విజయనగరం: చిన్న శ్రీను సోల్జర్స్ ఆధ్వర్యంలో ధర్మపురిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న సిరిసహస్ర



భోగాపురం : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ మండలకన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తదితరులు



నెల్లిమర్ల రూరల్: బూరాడపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న గ్రామ పెద్దలు



విజయనగరం రూరల్: ద్వారపూడిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ మన్మథకుమార్, తదితరులు

విజయనగరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతి భారతీయుడు గర్వించే వ్యక్తి అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. దేశం అన్నిరంగాల్లో ముందంజలో ఉందంటే దానికి కారణం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్ప మహోత్సవానికి సంఘీభావంగా విజయనగరం జిల్లా కేంద్రంలో స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో గల బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారీ మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ, దేశంలో సుస్థిర పాలన, సామాజిక అభివృద్ధి అంబేడ్కర్ విరచిత రాజ్యాంగం వల్లే సాధ్యమైందన్నారు. దేశానికి ఆయన ఆలోచనలు మార్గదర్శకమయ్యాయని చెప్పారు. అంబేడ్కర్ కృషి వల్లే దేశంలో ప్రతిఒక్కరూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం అనుభవిస్తున్నారని తెలిపారు. అట్టడుగువర్గాలకు రిజర్వేషన్లు కల్పించి, వారి అభ్యున్నతికి మార్గం చూపారన్నారు. అంబేడ్కర్ ఆశయాలను సాధించాలని, ఆయన ఆలోచనలను ప్రతి ఒక్కరికీ వివరించాలన్న గొప్ప సంకల్పంతో ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, సాంఘిక సంక్షేమాధికారి రామానందం, మెప్మా పీడీ సుధాకరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రొంగలి పోతన్న, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపువేణు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సంగంరెడ్డి బంగారునాయుడు, తదితర నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వాడవాడలా సామాజిక సమతా మహోత్సవం

విజయనగరం: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహావిష్కరనకు సంఘీభావంగా విజయనగరం జిల్లా కేంద్రంలోని వాడవాడలా సామాజిక సమతా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విజయనగరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఐదు ప్రధాన జంక్షన్లలో మానవహారాలు నిర్వహించి సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా ధర్మపురిలోని అంబేడ్కర్ కాలనీలో గల అంబేడ్కర్ విగ్రహానికి చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సిరిసహస్ర క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయనివిధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పాటు చేయడంతో పాటు విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేశారని చెప్పారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉప అధ్యక్షుడు తోట వాసు, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, శ్రీనివాస్, జగదీష్, శివ, అభిరామ్, దక్షిణామూర్తి, దళిత సంఘాల నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భరతజాతి ముద్దుబిడ్డ..

పూసపాటిరేగ: అంబేడ్కర్ భరతజాతి ముద్దు బిడ్డ అని పూసపాటిరేగ వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు అన్నారు. స్థానిక హరిజనకాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, టొంపల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.అలాగే మండలంలోని సీహెచ్ అగ్రహారం ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు, సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

బడుగు,బలహీనవర్గాల ఆశాజ్యోతి..

డెంకాడ: అంబేడ్కర్ బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోపాడ, గొలగాం, మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మనుషులందరూ సమానత్వంతో జీవించాలన్న ఆకాంక్షతో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్ము నాయుడు, డెంకాడ, పోలిపల్లి రైతు సహకార సంఘాల అధ్యక్షులు రొంగలి కనకసింహాచలం, బాలి సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, అధికారులు పాల్గొన్నరు.

డెంకాడలో ..

మండలంలోని డెంకాడ, దొడ్డిబాడువ గ్రామాల్లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ నాగభూషణం, రొంగలి గోపాలకృష్ణ, పాండ్రంకి ఆదినారాయణ, సిరికి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే సీఎం జగన్ లక్ష్యం

భోగాపురం: బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల భానుప్రకాష్, ఊడికల అప్పయ్యమ్మ, కొమ్మూరు సుభోషణరావు, సుందర హరీష్, పచ్చిపాల నాగలక్ష్మి, గురునాథరావు, అడపా ప్రసాద్, గురువులు, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన జై భీమ్ నినాదాలు..

నెల్లిమల రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో జైభీమ్ నినాదాలు మార్మోగాయి. బూరాడపేటలో పీఏసీఎస్ చైర్మెన్ కోట్ల పైడినాయుడు, సర్పంచ్ మక్కువ రమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు సంగంరెడ్డి జగన్నాథం, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బెల్లాన రామారావు, మక్కువ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి చేద్దాం

నెల్లిమర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. స్థానిక రామతీర్థం జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు శంకరరావు, అంబేడ్కర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

ఆయన ఆశయాలు ఆదర్శనీయం

విజయనగరం రూరల్: అంబేడ్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి నిర్మలాదేవి, జెడ్పీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ద్వారపూడిలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ డోల మన్మథకుమార్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన నాయకులు బి.ప్రవీణ్‌కుమార్, బొద్దుల జయరామ్, నడుపూరి అప్పలనాయుడు, బొద్దుల మహేష్, బొద్దుల రాంబాబు, లావేటి సురేష్, ఇజ్జాడ నారాయణరావు, సూర్యప్రకాష్, బాబ్జి, తాతారావు, టి.అప్పలరాజు, కోటి, రాజు, కిశోర్, కుమారస్వామి, బెల్లాన అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి



రోగులకు పంపిణీ చేస్తున్న మందులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి



పూసపాటిరేగ: మెడికల్ కిట్ అందజేస్తున్న ఎంపీపీ కల్యాణి, ఎంపీడీఓ రాధిక, తదితరులు

భోగాపురం: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని కొండ్రాజుపాలెంలో పార్టీ నాయకులు కోరాడ చిన్నారావు, ఎరుపల్లి పెద్దయ్యతో కలిసి ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 375 మంది రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల భానుప్రకాష్, ఎం. నరసింహులు, మూగి ధనరాజ్, దుక్క రమణ, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, వైద్యాధికారులు తిరుపతిస్వామి, మజ్జి గణపతిరావు, అలేఖ్య, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం.. : ఎంపీపీ కల్యాణి

పూసపాటిరేగ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని కొప్పెర్లలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడారు. అనంతరం మందుల పంపిణీపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మొదట విడతలో భాగంగా గతేడాది సెప్టెంబర్ నుంచి అక్టోబర్ వరకు వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారు రెండో విడత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రోగులకు మెడికల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు లంకలపల్లి రాజారావు, పుప్పాల లక్ష్మీనారాయణ, బొల్లు రమేష్, ఎంపీడీఓ ఎం. రాధికతో పాటు పలువురు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మహాత్మాగాంధీ విగ్రహ ఏర్పాటుపై ఆరా తీస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ జంక్షన్‌లో సుమారు రూ. 24 లక్షలతో ఏర్పాటు చేయనున్న మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటు పనులతో పాటు కార్పొరేషన్ కార్యాలయానికి సమీపంలో గల నెహ్రూ పార్కును రూ.60 లక్షల వ్యయంతో చిల్డ్రన్స్ పార్కుగా మార్పు చేస్తూ చేపడుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, ఇంజినీరింగ్ అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. నిర్ణయించిన సమయానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దక్షిణామూర్తి, డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఇంటర్నెట్

- ఏపీ ఫైబర్‌నెట్ జిల్లా మేనేజర్ పిళ్లా సతీష్



మాట్లాడుతున్న ఏపీ ఫైబర్‌నెట్ జిల్లా మేనేజర్ పిళ్లా సతీష్

విజయనగరం అర్బన్: ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం అందించాలని, ఈ బృహత్తర కార్యక్రమంలో కేబుల్ ఆపరేటర్లు భాగస్వాములు కావాలని ఏపీ ఫైబర్‌నెట్ జిల్లా మేనేజర్ పిళ్లా సతీష్ కోరారు. శుక్రవారం స్థానిక ఫైబర్‌నెట్ కార్యాలయంలో కేబుల్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 190 రూపాయలకే ఇంటర్నెట్ ప్యాకేజీ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఆపరేటర్ ఏపీఎస్ఎఫ్ఎల్ ఇంటర్నెట్ ప్యాకేజీలను వినియోగదారులకు తెలియజేయాలని సూచించారు. అంతేకాకుండా ఆరు నెలల ప్యాకేజీ ఒకేసారి యాక్టివేట్ చేసుకుంటే ఒక నెల.. 12 నెలల ప్యాకేజీ ఒకేసారి యాక్టివేట్ చేసుకుంటే రెండు నెలలు ఉచిత సబ్‌స్క్రిప్షన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్ఎల్ మేనేజర్లు సతీష్‌రెడ్డి, గంట మోహనరావు, శ్రీనివాస్, పరమేశ్వరరావు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని గుంపాంలో కొత్తకోట రాంబాబు నుంచి 50 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి. బాలకృష్ణ తెలిపారు. తనిఖీల్లో భాగంగా నిందితుడి ఇంటిలో మద్య సీసాలు లభ్యం కాగా, అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సీఎం సభకు తరలిరండి

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: భీమిలిలో ఈ నెల 25న జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయడానికి నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే అప్పలనరసయ్య సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు.

తెలగా కులస్తులను బీసీలో చేర్చాలి



తహసీల్దార్ భాస్కరరావుకు వినతిపత్రం అందజేస్తున్న తెలగా కులస్తుల సంఘ నాయకులు



విజయనగరం టౌన్: తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న పీవీఆర్

పూసపాటిరేగ: సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన తెలగా కులస్తులను బీసీల్లో చేర్చాలని మండల వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్‌తో పాటు పలువురు సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఇ. భాస్కరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్, తదితరులు మాట్లాడుతూ, తెలగా కులస్తుల్లో 80 శాతం మంది వెనుకబాటుతనంలో ఉన్నారన్నారు. కూలి పనులు చేసుకుంటూ బతకు వెళ్లదీస్తున్నారని, బీసీల్లో చేర్చితే తమ పిల్లల భవిష్యత్ బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలగా కులస్తుల సంఘ నాయకులు పసుపులేటి గోపి, జలపార శివ, పడాల శ్రీధర్, పుప్పాల లక్ష్మీనారాయణ, ఆకిరి ప్రసాదరావు, వల్లంశెట్టి వెంకటప్పారావు, లంకలపల్లి రాజారావు, లంకలపల్లి శ్రీనివాసరావు, బి. నారాయణరావు, పి.మల్లేశ్వరరావు, ముత్యాలు వెంకటరమణ, అల్లాడ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ కల్పించాలి

విజయనగరం టౌన్: తెలగా కులస్తులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఉత్తరాంధ్రా తెలగా సంఘ నాయకుడు పల్లంట్ల వెంకట రామారావు (పీవీఆర్) ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో తహసీల్దార్లకు సంఘ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, రిజర్వేషన్ లేకపోవడంతో తెలగా కులస్తులు ఎటువంటి రాయితీలు అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.